ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

గురువారం 27, జూలై 2023


## వరదొచ్చినప్పుడే .. మూసారాంబాగ్ గుర్తొస్తది: హన్మంతన్న



మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న హన్మంతన్న...

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:** రాష్ట్ర ప్రభుత్వానిక వరదలొచ్చినప్పుడే మూసారాంబాగ్ బ్రిడ్జి గుర్తుకు వస్తదని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. ఇయ్యాల మూసారాంబాగ్ చాందిని బ్రిడ్జి వద్ద వరద పరిస్థితిని ఆయన పరిశీలించారు. మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ నూతన బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేశారని ఆ వాగ్దానాలను గాలికి వదిలేసారని ఘాటుగా విమర్శించారు. తక్షణమే బ్రిడ్జ్ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్ లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, పి.రామ్మోహన్, షేక్ జమీర్, ముమ్మద్ ఫరీద్, రవికుమార్ , శ్రీనివాస్ రెడ్డి , జాంగీర్, ఆరిఫ్ తదితరులు ఉన్నారు



### జలదిగ్బంధంలో మోరంచపల్లి.. కేసీఆర్ ఆదేశంతో హెలీక్యాప్టర్లు

2



### భారీ వాన ఎఫెక్ట్.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. రేపు కూడా సెలవు

2



### హైకోర్టులో వనమా వెంకటేశ్వరరావుకు మళ్లీ ఎదురు దెబ్బ..

2



మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తో కలసి పరిస్థితి పరిశీలిస్తున్న కేటీఆర్,



మంత్రి కేటీఆర్‌కు తాజా పరిస్థితిని వివరిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్

### చేతనైతే సాయం చేయుండ్రి..

# చిల్లర రాజకీయాలొద్దు ...

- ఎమ్మెల్యే కాలేరుతో కలసి మూసారాంబాగ్ బ్రిడ్జివద్ద వరద పరిస్థితిని సమీక్షించిన కేటీఆర్
- వర్షాలపై కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని వెల్లడి
- నిరంతరం పని చేస్తోన్న ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీయవద్దని ప్రతిపక్షాలకు హితవు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:** కొన్నిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ అతలాకుతలమైంది. నగరంలో రోడ్లు జలమయమయ్యాయి. ప్రభుత్వం, అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇయ్యాల కూడా హైదరాబాద్‌లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో మంత్రి కేటీఆర్ ఇయ్యాల లోకల్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ , మలక్ పేట ఎమ్మెల్యే బలాల తదితరులతో కలసి మూసారాంబాగ్ బ్రిడ్జివద్ద మూసీనది వరద పరిస్థితి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ శ్రేణులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముంపు ప్రాంతాల్లో చేపట్టే సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ప్రజలకు నిత్యావసరాల పంపిణీ, ఇతర సాయం అందించాలన్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజలకు పార్టీ శ్రేణులు అండగా నిలవాలన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. పురపాలక శాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు చెప్పారు. వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రాథమిక ప్రాధాన్యతగా పని చేయాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల నుండి ప్రజలను తరలించాలని అధికారురులను ఆదేశించారు. సంబంధిత ఉద్యోగులకు సెలవులు రద్దు చేశామన్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ముఖ్యంగా ప్రాణనష్టం జరగకుండా చూడడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు మానుకొని భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేయాలని సూచించారు. వర్షంలో నిరంతరం పని చేస్తోన్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దన్నారు. విపత్కర పరిస్థితుల్లో చేతనైతే సాయం చేయాలన్నారు. వరంగల్ కూడా నీట మునిగిందని, అవసర మైతే తాను శుక్రవారం అక్కడకు వెళ్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, దూసరి లావణ్యశ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మూసీ వరద పరిస్థితిని అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:**
భారీ వర్షాల నేపథ్యంలో అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ .విజయ్ కుమార్ గౌడ్ ఇయ్యాల బాపునగర్, ఓవైసీ నగర్, సి బ్లాక్, పటేల్ నగర్, ప్రేమ్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వరద నీరు నిలువకుండా సజావుగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:**
అంబర్‌పేట డివిజన్‌లో వాటర్ వర్క్స్ వద్ద దెబ్బతిన్న రోడ్డుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదేశాలతో మరమ్మతు పనులను పర్య వేక్షిస్తున్న బీఆర్ఎస్ నాయకులు రాగుల ప్రవీణ్ పటేల్, బిక్షపతి శివానంద్, దేవేందర్, దయాకర్ తదితరులు



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:**
గోల్నాక డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో లోకల్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ ఇయ్యాల పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## విడవని వాన... వదలని వరద..

### నగరానికి బిగ్ అలర్ట్.. మళ్లీ భారీ వర్షాలు...

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:** హైదరాబాద్‌లో ఈ ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. నాలాల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అయితే కొద్ది సేపటి క్రితం వర్షం ఆగిపోయింది. కానీ వాన గండం మాత్రం ఇంకా పొంచి ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పిడిగు లాంటి వార్త చెప్పారు. ఈ రాత్రి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు.





## కేసీఆర్.. నిన్ను దేవుడు అందుకే పుట్టించాడని అన్నావు కదా?: కిషన్ రెడ్డి

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:** రైతుల కోసం సీఎం కేసీఆర్ గతంలో చేసిన ప్రకటనను చూసి ఏం చెబుతాడో అని అందరం చూశామని, అప్పుడు ఆయన మాట్లాడుతూ రైతులు వద్దనే వరకు ఉచిత ఎరువులు అందిస్తామని కీలక ప్రకటన చేశారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. తాను ప్రకటించేది విని ప్రపంచం ఆశ్చర్యపోతుందని, దేశం కిందమీద అవుతుందని, భూమి బద్దలు అవుతుందని, ఈ దేవుడు నన్ను ఇందుకే పుట్టించాడేమో.. అని ఆ రోజు కేసీఆర్ అన్నారని, అలా చెబుతూ రైతులకు ఉచిత ఎరువులు ఇస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. అయ్యా కేసీఆర్ గారు.. దేవుడు నిన్ను అందుకే పుట్టించాడని అన్నావు కదా.. రైతులకు ఉచితంగా ఎరువులు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. అసలు మోదీ ప్రభుత్వం ఎరువులపై పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తోందని, మీరు ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు.అన్నదాతల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు 1.25 లక్షల పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేసిన సందర్భంగా శామీర్‌పేట్ పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు.

## పీటీసీలో ఫ్రీ హెల్త్ క్యాంప్..

# 250 మంది పోలీసులకు హెల్త్ చెకప్

### పరిశీలించిన ప్రిన్సిపల్ మధుకర్ స్వామి

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 27:** అంబర్ పేట, మేడ్చల్ పోలీస్ ట్రైయినింగ్ కాలేజీల్లో ఇయ్యాల గురువారం ఫ్రీ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు . లయన్స్ క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ , కిమ్స్ రీసెర్చ్ ఫౌండేషన్ నేతృత్వంలోని వైద్య బృందం సుమారు 250 మంది పోలీసులకు హెల్త్ చెకప్ చేసి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా పీటీసీల ప్రిన్సిపల్ మధుకర్ స్వామి మాట్లాడుతూ... అనునిత్యం విధి నిర్వహణలో భాగంగా ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీటీసీ డీఎస్పీలు జి.జగన్ , విజయ్ కుమార్, ఎ.శ్రీధర్ రెడ్డి, వైద్యులు విజయభాస్కర్ రెడ్డి, జగన్నాధ ప్రవీణ్, మహేశ్, ఆదిత్య, క్రాంతి, లక్ష్మి కుమారి, రాజ్‌కుమార్, లయన్స్ రఘునాధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట పీటీసీలో శిక్షణ శిబిరంలో వైద్యులతో కలసి ప్రిన్సిపల్ మధుకర్ స్వామి

## హార్ట్ అటాక్‌తో పటాన్‌చెరు ఎమ్మెల్యే కుమారుడు మృతి



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 27:** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి (30) గుండెపోటుతో ఇయ్యాల గురువారం ఉదయం హఠాన్మరణం చెందారు. కిడ్నీలు పాడవడంతో కొన్ని రోజుల క్రితం నుంచి అనారోగ్యంతో కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో గుండెపోటు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన మృతి చెందారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే ఆయనకు కామెర్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో విష్ణువర్ధన్‌కు వైద్యులు డయాలసిస్ చేశారు.

గత కొద్ది రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే తెల్లవారుజామున 2 గంటలకు గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు విష్ణువర్ధన్ కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని గురువారం ఉదయం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నివాసానికి తరలించారు. కుమారుడి మృతితో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

# ములుగు జిల్లాలో జల ప్రళయం... ఐదుగురు గల్లంతు



**ఇయ్యాల్టి న్యూస్, ములుగు, జూలై 27:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. ములుగు జిల్లాలో జలప్రళయం కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో వరదల్లో గల్లంతై ఐదుగురు మృతి చెందారు. చనిపోయిన వారిలో.ఎస్.కే మైబూబ్ ఖాన్. (50), ఎం.డి. అజ్జు (20), మజీద్ సాబ్ (70) గా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఇక జిల్లా వ్యాప్తంగా 245 పశువుల మృత్యువాత పడ్డాయి. వర్షాల ప్రభావానికి 13 ఇళ్లు పూర్తిస్థాయిలో నేల మట్టం కాగా , పాక్షికంగా 64 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇక వర్ష బీభత్సానికి నాలుగు రోడ్లు ధ్వంసం కాగా ఒక చెరువు తెగిపోయింది. దీంతో రాకపోకలు బంద్ అయిపోయాయి. మరోవైపు మేడారం గ్రామాన్ని వరద ముంచేసింది. జంపన్నవాగునకు వరద పోటెత్తింది. దీంతో మేడారం సమ్మక్క సారక్క గద్దెల వరకు నీరు వచ్చి చేరింది.

మేడారం ప్రాగణం జలదిగ్బధంలో చిక్కుకుంది. గత రాత్రినుంచే జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. సమ్మక్క సారక్క జాతర జరిగే ప్రాతంలోని దుకాణాలు నీట మునిగాయి. షాపుల్లోకి భారీగా నీరు చేరి సామాన్లు తడిచిపోయాయి. దీంతో లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని వ్యాపారులు అంటున్నారు.

# హైకోర్టులో వనమా వెంకటేశ్వరరావుకు మళ్లీ ఎదురు దెబ్బ..



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 27:** కొత్తగూడెం ఎమ్మెల్యే ఎన్నిక విషయంలో వనమా వెంకటేశ్వరరావుకు హైకోర్టులో మళ్లీ చుక్కెదురైంది. ఎమ్మెల్యేగా వనమా ఎన్నిక చెల్లదంటూ రెండు రోజుల కిందట హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పు విషయంలో స్టే ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

తన ఎన్నిక చెల్లదంటూ ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదల చేస్తూ ఆదేశాలివ్వాలని వనమా వెంకటేశ్వరరావు హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశారు.

తీర్పును తాను సుప్రీంకోర్టులో సవాల్ చేస్తానని, ఈ మేరకు అప్పీల్‌కు వెళ్లేందుకు సమయం ఇవ్వాలని, తీర్పు అమలుపై స్టే ఇవ్వాలని కోరారు. ఇందుకు హైకోర్టు నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని 25న హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. ఆయనకు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది.

ఎన్నికలో రెండో అభ్యర్థిగా నిలిచిన జలగం వెంకట్రావునే 2018 డిసెంబర్ 12 నుంచి ఎమ్మెల్యేగా ప్రకటించాలని అధికారులను ఆదేశించింది.

# అమిత్ షా తెలంగాణ టూర్ మళ్లీ వాయిదా




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 26:** భారీ వర్షాల కారణంగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ టూర్ వాయిదా పడింది. ముందుగా 2023 జూలై 29న అమిత్ షా... హైదరాబాద్ షెడ్యూల్ ఖరారైంది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో టూర్ వాయిదా పడింది. వాస్తవానికి 2023 జూన్ 15న ఖమ్మం జిల్లా భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొనాల్సి ఉంది. ఈ సభకు తాను వస్తానని అమిత్ షా కూడా మాట ఇచ్చారు. ఈ మేరకు బీజేపీ నేతలు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు కూడా చేశారు. కానీ గుజరాత్‌లో వచ్చిన సైక్లోన్ తో అది వాయిదా పడింది.

# తెలంగాణలో వరద బాధిత జిల్లాలకు.. ప్రత్యేక అధికారులు..!



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 27:** ఎడతెరిపిలేని వానలు తెలంగాణలో బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు జిల్లాల్లో అసాధారణ వర్షపాతం నమోదవుతోంది. వరంగల్ నగరం నీట మునిగింది. కొన్ని ప్రాజెక్టులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఇంకొన్ని రోజులు వానలు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.వరద బాధిత జిల్లాలకు ప్రత్యేక అధికారులుగా ఐఏఎస్‌లను సీఎస్ శాంతికుమారి నియమించారు. ములుగు జిల్లా ప్రత్యేక అధికారిగా కృష్ణ ఆదిత్య, భూపాలపల్లికి పి.గౌతమ్, నిర్మల్‌కు ముషారఫ్ అలీ, మంచిర్యాలకు భారతి హోలికేరి, పెద్దపల్లి జిల్లాకు సంగీత సత్యనారాయణ, ఆసిఫాబాద్ జిల్లాకు హన్మంతరావును నియమిస్తూ ఉత్తర్వులు చేశారు. వీరంతా ఆయా జిల్లాల్లో వరద పరిస్థితులను పర్యవేక్షించనున్నారు.

### జలదిగ్బంధంలో మోరంచపల్లి..
# కేసీఆర్ ఆదేశంతో హెలీక్యాప్టర్లు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 27:** ఎడతెరిపి లేని వర్షాలతో తెలంగాణలోని నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరదల కారణంగా పలు ప్రాంతాలు నీట మునిగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామం జలదిగ్బంధమయింది. మరోవైపు ప్రగతి భవన్ లో వరదలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. వరదల పరిస్థితిని చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ముఖ్యమంత్రికి వివరిస్తున్నారు. ఈ సందర్భంగా మోరంచపల్లిలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు హెలికాప్టర్ ను పంపించాలని సీఎస్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ మిలిటరీ అధికారులతో చీఫ్ సెక్రటరీ సంప్రదింపులు జరిరి హెలీక్యాప్టర్లను పంపించారు.




# ప్రజలను ఆదుకోవాలి..
### మంత్రి కేటీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 27:**
మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ నగరం విలవిల లాడుతుందన్నారు. ప్రజల గోసను కేటీఆర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫాంహౌస్ లో కేసీఆర్, పార్టీలలో కేటీఆర్ సేద తీరుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం చేశామని చెప్పుకోవడానికి తండ్రి, కొడుకులు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. సహాయం కోసం పేద ప్రజలు వేచి చూస్తున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. రోజు రోజుకు హైదరాబాద్ నగరాన్ని దారుణంగా మారుస్తున్నారని విమర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. పాడైన రోడ్లను యుద్ధ ప్రతిపాధికన మరమ్మతులు చేయాలని కోరారు. ప్రమాదంలో ఉన్న ప్రజలను కాపాడాలన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోని పక్షంలో రేపు (శుక్రవారం) కాంగ్రెస్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీని ముట్టడిస్తామని హెచ్చరించారు.



# కేటీఆర్‌కు ఐఎస్బీ మొహాలీ నుంచి ఆహ్వానం

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 27:**
పంజాబ్‌లోని మొహాలీలో ఉన్న ప్రతిష్ఠాత్మక ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ) నుంచి తెలంగాణ మంత్రి కేటీఆర్ కు ఆహ్వానం అందింది. వచ్చే నెల 11న తమ క్యాంపస్ లో అడ్వాన్స్‌డ్ మేనేజ్ మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ 8వ బ్యాచ్ ను ప్రారంభించి, ప్రసంగించాలని కేటీఆర్ ను ఐఎస్బీ డీన్ మదన్ పిల్లుట్ల ఆహ్వానించారు. ఐఎస్బీకి మీరు బలమైన మద్దతుదారులుగా ఉన్నారని... మీ మద్దతు, సహకారం మున్ముందు కూడా ఇదేలా కొనసాగాలని తమ ఆహ్వానపత్రంలో మదన్ పిల్లుట్ల పేర్కొన్నారు. మేనేజ్ మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీలో వివిధ అంశాలు, దాని రూపకల్పన ప్రక్రియను అర్థం చేసుకునేందుకు మీ అనుభవం, సలహాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. మేనేజ్ మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ అనేది పబ్లిక్, ప్రైవేట్ రంగాల్లోని మిడ్ కెరీర్ నిపుణుల కోసం రూపొందించినది.




# తెలంగాణలో రికార్డు స్థాయిలో వర్షాలు.. ములుగులో 65 సెంటీమీటర్ల వర్షపాతం

**ఇయ్యాల్టి న్యూస్, ములుగు , జూలై 27:**
తెలంగాణలో కొన్ని రోజులుగా కురుస్తున్న నిరంతర వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు, వరదలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. కొన్ని జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.

గత 24 గంటల్లో పలు ప్రాంతాల్లో ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైనట్టు భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో అత్యధికంగా 649.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జయశంకర్ జిల్లా చిట్యాల్ మండలం చిట్యాల్ 616.5 మి.మీలతో రెండో స్థానంలో నిలిచింది. అదే జిల్లాలోని ఘన్‌పూర్ మండలం చెల్పూర్‌లో 475.8 మి.మీ, రేగొండ మండలంలో 467.0 మి.మీ, మొగుళ్లపల్లిలో 394 మి.మీ వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కర్కగూడెంలో 390 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. కరీంనగర్, హన్మకొండ, ఆదిలాబాద్, వరంగల్, జనగాం జిల్లాల్లోని పలు ప్రాంతాలు సహా 20 చోట్ల 230 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

### భారీ వాన ఎఫెక్ట్.. తెలంగాణ ప్రభుత్వం
# కీలక నిర్ణయం.. రేపు కూడా సెలవు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 27:** తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులపై నీరుచేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. హైదరాబాద్ సహా చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి.



భారీ వర్షాల దెబ్బకు జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. వర్షాల కారణంగా ఇప్పటికే రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు తెలంగాణ ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం వరకు వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో పాటు, శుక్రవారంసైతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో తెలంగాణలోని విద్యా సంస్థలకు ప్రభుత్వం రేపు (శుక్రవారం) కూడా సెలవు ప్రకటించింది. భారీ, అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ సెలవు ప్రకటించినట్లు తెలిపింది.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/



## రెడ్ డైరీనే రాజస్థాన్‌లో కాంగ్రెస్‌ను ముంచుతుంది: ప్రధాని మోడీ



ఇయ్యాల్టి న్యూస్, రాజస్థాన్, జూలై 27: రాజస్థాన్ ప్రభుత్వం ఆర్థిక అవక తవకలకు పాల్పడిందని మాజీ మంత్రి రాజేంద్ర గూడ రెడ్ డైరీ పేరుతో చేసిన ఆరోపణల నేపథ్యంలో .. అదే రెడ్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రధాని మోడీ రాజస్థాన్‌లోకి సీకర్‌లో జాతికి అంకితం చేశారు. సీకర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో 1.25 లక్షల 'పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రధాని జాతికి అంకితం చేశారు. విత్తనాల నుంచి మార్కెటింగ్ వరకు తొమ్మిదేళ్ల పాలనలో రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఇటీవల రాజస్థాన్‌లో కలకలం రేపిన 'రెడ్ డైరీ'లోని రహస్యాలు.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని నాశనం చేస్తాయన్నారు. అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్న వివరాలు రెడ్ డైరీలో ఉన్నాయంటూ ఇటీవల ఉద్వాసనకు గురైన మంత్రి రాజేంద్ర గుడా పేర్కొన్న విషయం తెలిసిందే.



## ఏఐ మాయ.. డాన్ గెటప్‌లో

# రామ్ గోపాల్ వర్మ

**ఇయ్యాల్టి న్యూస్, సినిమా, జూలై 27:** అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలు అన్నీఇన్నీ కావు. నేటి తరం టెక్ ప్రపంచంలో విపరీతంగా వినిపిస్తున్న పదం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ . ఇది సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. టెక్ రంగంలోనే కాదు.. ఆర్టిస్టల ఊహా శక్తికీ కూడా ఏఐ రెక్కలు తొడుగుతోంది. ఏఐ టూల్స్‌తో రచయితలు అలవోకగా బుక్స్ రాస్తుండగా ఆర్టిస్టులు సైతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో తమ నైపుణ్యాలకు అద్భుత క్రియేటివిటీ జోడిస్తున్నారు. మిడ్‌జర్నీ వంటి యాప్‌లను ఉపయోగిస్తూ ఇప్పటివరకూ మన ఊహకు సైతం అందని ఇమేజ్‌లను జనరేట్ చేస్తున్నారు. తాజాగా ప్రముఖ వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా తన ఏఐ చిత్రాన్ని పంచుకున్నారు. డాన్ గెటప్‌లో ఉన్న రామ్ గోపాల్ వర్మ.. బ్లాక్ షేడ్స్ పెట్టుకుని సిగార్‌తో రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపించాడు. "ఐ గాట్ ఏఐ'డీ" అంటూ ట్వీట్టర్‌లో రాసుకొచ్చారు. అయితే ఈ ఫోటో డిజైన్ చేసిన ఏఐ ఆర్టిస్ట్ ఎవరో వర్మ వెల్లడించలేదు. ప్రస్తుతం ఆయన షేర్ చేసిన ఫోటో వైరల్ గా మారింది.



## ఆఫ్రికా దేశంలో మిలటరీ తిరుగుబాటు..

# దేశాధ్యక్షుడినే బంధించి మరీ..?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 27:**
పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజర్ లో సైన్యం తిరుగుబాటు ప్రకటించింది. దేశాధ్యక్షుడికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేపడుతున్నట్లు జాతీయ ఛానల్‌లో సైన్యం వెల్లడించింది. దేశ రాజ్యాంగాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అన్ని జాతీయ సంస్థలను, సరిహద్దుల్ని మూసివేస్తున్నట్లు సైనికులు తెలిపారు. దేశాధ్యక్షుడు మొహమ్మద్ బజౌమ్ తమ ఆధీనంలో ఉన్నట్లు సైనికులు వెల్లడించారు.ప్రెసిడెన్షియల్ గార్డ్స్‌కు చెందిన దళాలు అధ్యక్ష భవనాన్ని సీజ్ చేశారు. రాజధాని నియామేలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అధ్యక్షుడు బజౌమ్‌తో జరిగిన చర్చలు విఫలం అయ్యాయని, అందుకే ఆయన్ను రిలీజ్ చేయడం లేదని సైనికులు తెలిపారు. అధ్యక్షుడు బజౌమ్ అరెస్టును అమెరికా, ఐక్యరాజ్యసమితి ఖండించాయి.
పశ్చిమ ఆఫ్రికాలో ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని అణిచివేయడంలో బజౌమ్ కీలక పాత్ర పోషించారు. పశ్చిమ దేశాలకు ఆయన మంచి సపోర్టు ఇచ్చారు. ఇటీవల నైజర్ పొరుగు దేశాలైన మాలి, బుర్కినా ఫాసోలో కూడా సైనిక తిరుగుబాట్లు చోటుచేసుకున్నాయి.

## జవాన్ ప్రాణాలు కోసం..

## నాగ్‌పూర్ నుంచి గుండె.. పూణెలో ఆపరేషన్


**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 27:**
కేవలం 31 ఏళ్లకే ప్రపంచానికి వీడ్కోలు పలుకుతూ ఓ మహిళ దేశాన్ని కాపాడుతున్న జవాన్ ప్రాణాలు నిలబెట్టింది. నాగ్‌పూర్‌లో మహిళ బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించిన తర్వాత, ఆమె గుండెను భారత వైమానిక దళ సైనికుడికి అమర్చారు. ఈ ఆపరేషన్ పూణేలో జరిగింది, ఇక్కడ పోలీసుల సహాయంతో రెండు నగరాల్లో గ్రీన్ కారిడార్‌లను సిద్ధం చేశారు. ఈ డ్యూటీ



కోసం వైమానిక దళ విమానాన్ని మోహరించారు. మహిళ ఎయిర్ ఫోర్స్ సిబ్బందితో సహా మొత్తం నలుగురికి కొత్త జీవితాన్ని ఇచ్చింది. మహిళ కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె గుండెతో పాటు కాలేయం, రెండు కిడ్నీలు కూడా మరో ముగ్గురికి అమర్చారు. నాగ్‌పూర్‌లో నివసిస్తున్న 31 ఏళ్ల శుభాంగి గన్యార్పవార్ జూలై 20న అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. భర్త, కూతురితో కలిసి ఉంటున్న శుభాంగికి తీవ్ర తలనొప్పి రావడంతో అకస్మాత్తుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆ తర్వాత అతడికి బ్రెయిన్ డెడ్‌గా ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. శుభాంగి భర్త, సోదరుడు ఆమె శరీర భాగాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీని తర్వాత, జూలై 26న పూణేలో ప్రాణాలతో పోరాడుతున్న వైమానిక దళానికి చెందిన వ్యక్తికి శుభాంగి గుండెను అమర్చాలని నిర్ణయించారు. ఇందుకోసం ముందుగా నాగ్‌పూర్‌లో, ఆ తర్వాత మహారాష్ట్ర పోలీసుల సహకారంతో పూణేలో గ్రీన్ కారిడార్‌ను సిద్ధం చేశారు.

## దుందుడుకు వ్యాఖ్యలు శాంతికి ముప్పు..

# రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై పాక్



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 27:** భారతదేశ గౌరవం, ప్రతిష్టలను కాపాడుకోవడం కోసం నియంత్రణ రేఖ దాటేందుకు సిద్ధంగా ఉన్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపిన విషయం తెలిసిందే. 24వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బుధవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై పాకిస్థాన్ తీవ్రంగా స్పందించింది. ఈ దుందుడుకు వ్యాఖ్యలు ప్రాంతీయ శాంతి, సుస్థిరతకు ముప్పు అని పేర్కొంది. రాజ్‌నాథ్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా పాకిస్థాన్ విదేశాంగ శాఖ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'అలాంటి దుందుడుకు వ్యాఖ్యలు ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలకు ముప్పు. దక్షిణాసియాలో వ్యూహాత్మక వాతావరణాన్ని అస్థిరపరుస్తాయి. అందుకే చాలా జాగ్రత్తగా ఉండాలని భారత్ కు మేము సలహా ఇస్తున్నాము' అని తెలిపింది. 24వ కార్గిల్ దివస్ సందర్భంగా రాజ్‌నాథ్ బుధవారం ద్రాస్ లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి.. అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాక్ కు పరోక్ష హెచ్చరిక చేశారు. పాకిస్థాన్ వెన్నుపోటు పొడవడంతోనే కార్గిల్ యుద్ధం తలెత్తిందన్నారు. మళ్లీ అలాంటి ఘటనలు రిపీట్ అయితే భారత్ తన ప్రయోజనాలు కాపాడుకునేందుకు నియంత్రణ రేఖ దాటేందుకూ సిద్ధంగా ఉందని అన్నారు. మాకు అన్నింటికంటే దేశ గౌరవం, ప్రతిష్ట అధికమని, దేశ గౌరవాన్ని ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు ఎంతవరకైనా వెళతామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

## అబ్బా.. వీళ్ల ముద్దు పాడుగాను...!

# గిన్నిస్... రికార్డ్... పట్టేసిన జంట

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 27:** కెనడాకు చెందిన ఓ జంట తమ 'ఘాటు' ముద్దుతో గిన్నిస్ రికార్డు పట్టేశారు. ఏకంగా 15 నిమిషాల 6.5 సెకన్లపాటు



కొనసాగిన ఆ చుంబనం వెనుక మరో ప్రత్యేకత ఉంది. అదేంటంటే? సాధారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా.. ఏదైనా రికార్డు సరికొత్తగా, వింతగా ఉంటే దానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కుతుంది. ఇందులో ప్రత్యేకత ఏముందంటారా? అక్కడే ఉంది అసలు విషయం. అదేంటంటే? ముద్దు పెట్టుకోవడానికి ముందు వారిద్దరు 'హెబనెరో పెప్పర్' తిన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఘాటైన మిరపకాయగా దీనికి పేరుంది. అలాంటి దాన్ని ఇద్దరూ తిని దాదాపు 15 నిమిషాలు ముద్దుపెట్టుకోవడం మామూలు విషయం కాదు కదా!.. అందుకే గిన్నిస్? రికార్డు నమోదైంది. కెనడాకు చెందిన మైక్, జామీ జాక్ దంపతులు ఈ ప్రయత్నంలో పాల్గొన్నారు. త్వరలో వారి వివాహ 15వ వార్షికోత్సవం రాబోతోంది. అందుకు గుర్తుగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ ఘాటు ముద్దు పెట్టుకున్నారట. ప్రపంచంలోనే ఘాటైన పెప్పర్లు తిన్న రికార్డులు ఇదివరకే మైక్ పేరిట ఉన్నాయి. తన భార్యను సైతం రికార్డులో భాగం చేయాలనే ఉద్దేశంతో నెల రోజుల నుంచి ఆమెకు శిక్షణ ఇచ్చాడు.

## సిక్స్ ప్యాక్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న...

# సచిన్ టెండూల్కర్ కొడుకు అర్జున్



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 27:** భారతీయ క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కొడుకు అర్జున్ టెండూల్కర్ కు ఈ ఏడాది ఐపీఎల్ మంచి మెమొరీస్ ను మిగిల్చింది. ఈ సీజన్ లో నాలుగు మ్యాచ్ లను ఆడిన అర్జున్ మూడు వికెట్లను తీయడమే కాక, 92 పరుగులు చేశాడు. అంతేకాదు దేశవాళీ క్రికెట్ లో భాగమైన దేవధర్ ట్రోఫీలో అర్జున్ సౌత్ జోన్ కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. క్రికెట్ లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అర్జున్ తన వంతు ప్రయత్నం చేస్తున్నాడు. పేస్ బౌలర్ అయిన అర్జున్ ముఖ్యంగా ఫిట్ నెస్ పై దృష్టి సారించాడు. ఈ క్రమంలో సిక్స్ ప్యాక్ బాడీని బిల్డప్ చేశాడు. షర్ట్ లెస్ లో తన సిక్స్ పాక్ యాబ్స్ ను చూపిస్తూ దిగిన మిర్రర్ సెల్ఫీ ఫొటోను అర్జున్ సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ పిక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పిట్ నెస్ పట్ల అర్జున్ కు ఉన్న కమిట్ మెంట్ పై నెటిజెన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## అప్పు తిరిగి ఇవ్వలేదని అరాచకం..

# భర్త కళ్ల ముందే భార్యపై...?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్‌డెస్క్, జూలై 27:** అప్పు తిరిగి చెల్లించనందుకు భర్త కళ్ల ముందే అతడి భార్యను కత్తితో బెదిరించి



అత్యాచారానికి పాల్పడ్డాడో వడ్డీ వ్యాపారి. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణెలో జరిగింది. మాహారాష్ట్ర.. పుణెలో ఓ వ్యక్తి అప్పు తిరిగి చెల్లించనందుకు భర్త కళ్ల ముందే అతడి భార్యపై అత్యాచారానికి పాల్పడ్డాడు ఓ వడ్డీ వ్యాపారి. ఈ ఘటన ఫిబ్రవరిలో జరిగిందని.. నిందితుడిని అరెస్టు చేసినట్లు హడప్సర్? పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణెలో ఓ 47 ఏళ్ల వ్యక్తి వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. అతడి వద్ద ఓ వ్యక్తి అప్పు తీసుకున్నాడు. అయితే, ఆ అప్పును తిరిగి చెల్లించలేకపోయాడు. దీంతో భాదితుడిపై పగ పెంచుకున్న వడ్డీ వ్యాపారి.. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాను అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటికి వెళ్లాడు. అనంతరం ఆ వ్యక్తి ముందే అతడి భార్యను కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడు ఈ ఘటనను తన మొబైల్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఘటన పోలీసుల దృష్టికి వెళ్లడం వల్ల నిందితుడిపై సంబంధిత ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి.. అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.



## కేరళ సహా తొమ్మిది రాష్ట్రాల

# గబ్బిలాలలో నిపా వైరస్..


### ఐసీఎంఆర్ షాకింగ్ రీసెర్చ్..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 27:**
తొమ్మిది రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని గబ్బిలాలలో నిపా వైరస్ వ్యాప్తికి ఆధారాలు కనిపెట్టారు శాస్త్రవేత్తలు. నిపా వైరస్ గుర్తించిన ప్రాంతాలతో పాటు తెలంగాణ, గుజరాత్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, చండీగఢ్‌లలో పరీక్షలు నిర్వహించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో తొమ్మిది రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో గబ్బిలాలలో నిపా వైరస్ వ్యాపించినట్లు రుజువైంది. ఇప్పటి వరకు 14 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్వే పూర్తయింది. కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, మేఘాలయ, పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలలో నిపా వైరస్ యాంటీబాడీలు గబ్బిలాలలో కనిపించాయని, గ్రూప్ లీడర్, మాగ్జిమమ్ కంటైన్‌మెంట్ లాబొరేటరీ శాస్త్రవేత్త డాక్టర్ ప్రజ్ఞా యాదవ్ తెలిపారు.నిపా వైరస్ గుర్తించిన ప్రాంతాలతో పాటు తెలంగాణ, గుజరాత్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, చండీగఢ్‌లలో పరీక్షలు నిర్వహించారు. నిపా వైరస్ మానవులలో ప్రాణాంతక శ్వాసకోశ, మెదడు ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందని స్పష్టం చేసింది.గబ్బిలాలు టెరోపస్ జాతి వైరస్ వాహకాలు. మహమ్మారి సంభావ్యత కలిగిన వ్యాధికారక క్రిములలో ఇది ఒకటి. నిపా కేసుల్లో మరణాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. 2018-19లో కేరళలో నిపా వెలుగులోకి వచ్చినప్పటి నుండి నిరంతర నిఘాను పెంచింది.

## అన్నదాతకు గుడ్‌న్యూస్..

## పీఎం కిసాన్ సమ్మాన్ యోజన నిధులు విడుదల చేసిన ప్రధాని మోదీ ..

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 27:** దేశంలోని కోట్లాది మంది రైతులు ఎదురుచూస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదలయ్యాయి. 14వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. గురువారం రాజస్థాన్‌లోని సికార్‌లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో రైతులకు ప్రయోజనకరమైన పథకం కింద ప్రధాని మోదీ నిధులు విడుదల చేశారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా దేశంలోని 8.5 కోట్ల మంది రైతుల ఖాతాలకు రూ. 2వేలు చొప్పున నేరుగా రూ. 17వేల కోట్లకుపైగా జమ చేశారు.పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన



రైతులు ప్రతీయేటా మూడుసార్లు రూ. 2వేలు మొత్తం రూ. 6వేలు పొందుతున్నారు. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ - జులై నెలల మధ్యలో, ఆగస్టు - నవంబర్, డిసెంబర్ - మార్చి నెలలు మూడు వాయిదాల్లో డబ్బులు అర్హులైన రైతులకు ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వం అందించే నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమఅవుతున్నాయి. తాజాగా 14వ విడత పీఎం - కిసాన్ పథకం కింద నిధులు విడుదల చేసిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. దేశంలోని రైతుల సమస్యల పరిష్కారానికి నేడు 1.25 లక్షల కిసాన్ సమృద్ధి కేంద్రాలను అంకితం చేస్తున్నామని చెప్పారు. వీటి ద్వారా వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సమాచారం, ప్రతి పథకం గురించిన సమాచారం, దాని ప్రయోజనాలు తదితరాలను తెలియజేయటం జరుగుతుందని చెప్పారు.

## బార్బీగా మారిపోయిన మహేష్ గారాల పట్టి సితార..

### ఎంత క్యూట్‌గా ఉందో చూశారా?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్‌ల గారాల పట్టి సితార ఘట్టమనేని గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. స్టార్ కిడ్‌గా ఇప్పటికే హీరోయిన్లను మించి క్రేజ్ సొంతం చేసుకుందీ ట్యాలెంటెడ్ గర్ల్.మహేష్ బాటలోనే నడుస్తూ ఇప్పటికే ఒక జ్యువెలరీ యాడ్ చేసింది. దీనికి మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది. ఇక ఇటీవల తన బర్త్‌డే సందర్భంగా స్కూల్ పిల్లలకు సైకిళ్లు కూడా పంపిణీ చేసింది.ఇదిలా ఉంటే ప్రస్తుతం లండన్ వెకేషన్ లో ఉంది మహేష్ ఫ్యామిలీ. భార్య నమ్రత, గౌతమ్, సితార కూడా అక్కడే ఉన్నారు. లండన్ అందాలను ఆస్వాదిస్తున్నారు.

తాజాగా షాపింగ్‌కు వెళ్లిన సితార అక్కడి ఫొటోలను షేర్ చేసింది. అక్కడి బార్బీ టాయ్‌షాప్‌లో బార్బీ గల్‌లా పోజులిచ్చింది. దీనికి ' ఐ యామ్‌బార్బీ గర్ల్' అని క్యాప్షన్ కూడా ఇచ్చింది.ఈ సందర్భంగా పింక్ కలర్ టాప్, దానికి మ్యాచింగ్‌గా లైట్ పింక్ స్కర్ట్‌తో ఎంతో క్యూట్‌గా కనిపించింది సితార. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.







## నీ ముఖానికి అంత సీన్ లేదు అన్నారు..

### షాకింగ్ విషయం చెప్పిన తమన్నా

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్స్‌గా నటించిన వయ్యారి భామల్లో తమన్నా ఒకరు. మిల్కీ బ్యూటీ గా మంచి క్రేజ్ ను సొంతం చేసుకుంది. శ్రీ సినిమాతో హీరోయిన్‌గా అడుగుపెట్టిన తమన్నా ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన హ్యాపీ డేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్ రేంజ్ కు ఎదిగింది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేసి మెప్పించింది ఈ భామ. అలాగే హిందీలోనూ సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం తమన్నా టాలీవుడ్ లో స్పీడ్ తగ్గించిందనే చెప్పాలి. యంగ్ హీరోల సరసన సినిమాలు చేసిన ఈ బ్యూటీ. ఇప్పుడు సీనియర్ హీరోలతో జోడీ కడుతుంది.ఎఫ్ 2, ఎఫ్ 3 సినిమాలో వెంకటేష్ సరసన నటించిన మిల్కీ బ్యూటీ.. ఇప్పుడు చిరంజీవితో సినిమా చేస్తోంది. భోళాశంకర్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది తమన్నా.. ఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ ముద్దుగుమ్మ మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది.

కేరీర్ బిగినింగ్ లో తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను పంచుకుంది మిల్కీ బ్యూటీ. సినిమాల్లోకి వెళ్తాను అని అంటే ఆమెను హేళన చేశారట..నీ మొహానికి హీరోయిన్ అవుతావా అని అన్న వాళ్ళు కూడా ఉన్నారట. అలా అన్నది బయట వాళ్ళు కూడా కాదట.. తన సొంత వారే నీ ఫేస్ కు హీరోయిన్ అంత సీన్ లేదు అని అన్నారట.. అప్పుడు చాలా హర్ట్ అయ్యాను అని తెలిపింది తమన్నా.. కానీ పట్టుదలతో తనను తాను ప్రూవ్ చేసుకొని ఇప్పుడు హీరోయిన్ గా రాణిస్తున్నాను అని తెలిపింది ఈ చిన్నది.

## చూసి మూర్చాలె.....



## పెద్ద కళ్ల ముద్దుగుమ్మ.. కియారా అద్వానీ లేటెస్ట్ పిక్స్...

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: పెద్ద కళ్ల ముద్దుగుమ్మ కియారా అద్వానీకి కొత్తగా పరిచయం అవసరం లేదు. ఆ పెద్దపెద్ద కళ్లు తెలుగువారికి పాత చుట్టాలే.. తాను సినిమాలో కనిపిస్తే చాలు.. వెండితెర విందు భోజనమే... ఇదిగో ఇలా లేటెస్ట్ పిక్స్ తో సందడి చేస్తోంది..

## నాలుగు డిగ్రీల చల్లటి నీటిలో సమంత ఐస్ బాత్..

## ఆ సమస్య నుంచి ఉపశమనం కోసమంట..?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: టాలీవుడ్ హీరోయిన్ సమంత.. ప్రస్తుతం ఇండినేషియాలోని బాలిలో వెకేషన్ ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే ఆమె మయోసైటిస్ చికిత్స కోసం అమెరికా వెళ్లనున్నారు. ఈ క్రమంలోనే ఆమె కొద్దిరోజులపాటు సినిమాలకు బ్రేక్ తీసుకున్నారు. ఇటీవలే ఖుషి, సిటాడెల్ షూటింగ్స్ కంప్లీట్ చేసిన సామ్.. ఇప్పుడు తన స్నేహితురాలితో కలిసి బాలిలో గడుపుతున్నారు. అక్కడ ప్రకృతి ప్రశాంతత వాతావరణంలో గడుపుతున్న ఫోటోస్, వీడియోస్ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులకు టచ్ లో ఉన్నారు. ఇక బాలిలో సైతం సామ్ తన మయోసైటిస్ చికిత్సను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. తన రెండు కాళ్లపై బ్యాలెన్స్ ఛాలెంజ్ అంటూ జిమ్?లో కఠినమైన వర్కవుట్స్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోస్ నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ఐస్ బాత్ థెరపీ వీడియో షేర్ చేశారు.నాలుగు డిగ్రీల సెల్సియస్ చల్లని నీటిలో దాదాపు 6 నిమిషాలపాటు ఉండిపోయారు సామ్. ఈవీడియోను తన ఇన్ స్టా స్టోరీలో షేర్ చేసుకున్నారు. అయితే గతంలోనూ సామ్ ఇలాంటి ఐస్ థెరపీకి సంబందించిన వీడియోను పంచుకున్నారు. మయోసైటిస్ సమస్య నుంచి బయటపడేందుకు తీసుకుంటున్న చికిత్సలో ఇలా చల్లటి నీటిలో ఎక్కువ సమయం గడపడం కూడా ఒక భాగమని తెలుస్తోంది.



## సర్జరీ చేయించుకున్న ముద్దుగుమ్మలు..

## కొంతమందికి ఇలా.. మరికొంతమందికి అలా

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: అందాన్ని మెరుగు పరుచుకోవడానికి సర్జరీ చేయించుకున్న వారు చాలా మంది ఉన్నారు. ఇండస్ట్రీ లోకి వచ్చిన తర్వాత శాస్త్ర చికిత్స చేయించుకున్న హీరోయిన్స్ ఉన్నారు. ఈ భామలు కెరీర్ బిగినింగ్ తో పోల్చుకుంటే ఇప్పుడు మరింత అందంగా ఉన్నారు. అయితే తాము సర్జరీ చేయించుకున్నాం అని ఒప్పుకున్నా హీరోయిన్స్ కూడా ఉన్నారు. రీసెంట్ గా తాను సర్జరీ చేయించుకోవడంతో తన అందం పోయింది అంటుంది ఉర్ఫీజావిద్.. తాను లిప్ సర్జరీచేయించుకున్నా అని తెలిపింది. అయితే లిప్ సర్జరీ కారణంగా తన అందం పోయిందట. సర్జరీ వికటించడంతో లిప్ పెద్దగా భయంకరంగా మారిపోయిందని తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసింది. స్టార్ హీరోయిన్ శ్రుతిహాసన్ కూడా తన అందం కోసం సర్జరీ చేయించుకుంది. తన ముక్కు ,పెదాలకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంది ఈ విషయాన్ని ఆమె స్వయంగా తెలిపింది. అలాగే బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ కూడా కాస్మెటిక్ సర్జరీ చేయించుకుందని ఆ మధ్య పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి.

అనుష్క లిప్ కు సర్జరీ చేయించుకుందట. మరో బాలీవుడ్ బ్యూటీ శిల్ప శెట్టి కూడా తాను అందంగా కనిపించడం కోసం సర్జరీ చేయించుకుంటూ ఉంటానని ఓ ఇంటర్వ్యూలో తెలిపింది.




## సూపర్ స్టార్ సినిమాలో న్యాచురల్ స్టార్..

## రజినీ మూవీలో ఛాన్స్ కొట్టేసిన నాని..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: టాలీవుడ్ ఇండస్ట్రీలో న్యాచురల్ స్టార్ నాని క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండా ఇండస్ట్రీలోకి అడుపెట్టి తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకున్నారు. ఇటీవలే దసరా సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. ఈ సినిమా దాదాపు రూ. 100కోట్లకు పైగా వసూళు చేసింది.తాజాగా నాని మరో లక్కీ ఛాన్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. ఏకంగా సూపర్ స్టార్ రజినీకాంత్ సినిమాలో నటించే అవకాశం నానికి వచ్చింది.

రజినీకాంత్ కొత్త సినిమాలో నాని ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే అగ్రిమెంట్ అయ్యిందని టాక్.అయితే అది గెస్ట్ రోల్ కాదని.. కాని కథను తిప్పే పాత్ర అనే ప్రచారం మొదలైంది. రజినీ కాంత్ కొత్త సినిమా టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఆడియన్స్ ముందుకు రానుందని.. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిసంచనున్నారని టాక్. సూపర్ స్టార్ సినిమాలో న్యాచురల్ స్టార్.. రజినీ మూవీలో ఛాన్స్ కొట్టేసిన నాని..



## 'వాచ్ అమ్మితే బ్యాచ్ సెటిలైపోద్ది'..

### 'బ్రో' ఈవెంట్‌లో పవన్ ధరించిన వాచ్ ధరెంతో తెలుసా?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 'బ్రో' ఫీవర్ నడుస్తోంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్, సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ నటించిన ఈ మెగా మల్టీ స్టారర్ మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సముద్రఖని డైరెక్ట్ చేసిన ఈ మూవీ రేపు శుక్రవారం ఈ మూవీ రిలీజ్ కానుంది. దీంతో నెట్టింట ప్రస్తుతం బ్రో మేనియా నడుస్తోంది. దీనికి తగ్గట్టుగానే పవన్, తేజ్‌ల పోస్టర్స్, మేకింగ్ వీడియోలను రిలీజ్ చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు మేకర్స్. కాగా ప్రమోషన్లలో భాగంగా బ్రో ప్రి రీలీజ్ ఈవెంట్ మంగళవారం (జులై 25) శిల్పకళా వేదికలో అట్టహాసంగా జరిగింది. సాయి ధరమ్ తేజ్, వరుణ్ తేజ్, కేతికా శర్మ, ప్రియా ప్రకాష్, సముద్రఖని, బ్రహ్మానందం తదితర సెలబ్రిటీలందరూ ఈ ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఇక ఎప్పటిలాగే తనదైన స్పీచ్‌తో అదరగొట్టేశారు పవన్. అయితే ఈ ఫంక్షన్‌లో పవన్ కల్యాణ్ పెట్టుకున్న వాచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో దాని బ్రాండ్ అండ్ కాస్ట్ డీటెయిల్స్ గురించి నెటిజన్లు తెగ ఆరాతీశారు. బ్రో ఈవెంట్లో పవన్ కల్యాణ్ ధరించిన వాచ్ బ్రెగ్యుట్ మైరెన్ క్రోనోగ్రాఫ్. ఇది ప్రపంచంలో అత్యంత ఖరీదైన వాచుల్లో ఒకటి. దీని ధర సుమారు రూ. 21,45,678 లని తెలుస్తోంది. ఇది చూసి అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. 'పవర్ స్టార్.. అంటే ఆ మాత్రం రేంజ్ ఉండాలి' అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు .అలాగే అత్తారింటికి దారేదిలో పవన్ చెప్పిన డైలాగ్ ' వాచ్ అమ్మితే బ్యాచ్ సెటిలైపోద్ది'ను గుర్తుచేసుకుంటున్నారు. కాగా బ్రో మూవీకి థమన్ స్వరాలు సమకూర్చారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ సమకూర్చారు.



## అల్లుఅర్జున్‌కు నో చెప్పిన యంగ్ బ్యూటీ శ్రీలీల. ఎందుకంటే..?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: టాలీవుడ్ బిజీయెస్ట్ అండ్ క్యూట్ బ్యూటీ అనగానే ఇప్పుడు అందరికీ గుర్తొచ్చేది శ్రీలీలనే. 'పెళ్లి సందడి'తో పరిచయమైన ఈ భామ.. 'ధమాకా'తో రూ.100కోట్ల సక్సెస్‌ను అందుకుంది. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో జెట్ స్పీడ్‌తో కెరీర్‌లో దూసుకెళ్తోంది. గ్యాప్ లేకుండా షూటింగ్‌లలో పాల్గొంటోంది. యువ కథనాయకుల నుంచి స్టార్ హీరోలకు వరకు అందరితో సినిమాలు చేస్తోంది. వీరిలో పవర్‌స్టార్ పవన్ కల్యాణ్, సూపర్ స్టార్ మహేశ్‌బాబు, నటసింహం బాలకృష్ణ, నితిన్, రామ్ పోతినేని వంటి ప్రముఖ హీరోలు ఉన్నారు. అయితే ఐకాన్ స్టార్ అభిమానులు కూడా.. తమ ఫేవరెట్ హీరో అల్లు అర్జున్?తో చేయాలని అడుగుతున్నారు. ఇప్పటికే ఈ ఇద్దరి కాంబోలో ఓ యాడ్ కూడా వచ్చి ఆకట్టుకుంది. అందులో వారిద్దరి కమిస్ట్రీ కూడా అందరికీ నచ్చింది. కానీ తాజాగా ఆమె ఓ విషయంలో అల్లుఅర్జున్?కు నో చెప్పిందట. ప్రస్తుతం ఈ విషయం నెటింట్లో చక్కర్లు కొడుతోంది. ఆ వివరాలు..

## అందంతో కవ్విస్తున్న చిన్నది..

### అనిక సురేంద్రన్ లేటెస్ట్ పిక్స్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 27: చైల్డ్ ఆర్టిస్ట్ గా పలు సినిమాలు చేసి ఆపై హీరోలుగా హీరోయిన్స్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అలా వచ్చిన వారిలో చాలా మంది సినిమా ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. టాలీవుడ్ లో ఇప్పటికే చాలా మంది చైల్డ్ ఆర్టిస్టులు హీరో హీరోయిన్స్ గా సినిమాలు చేస్తున్నారు. అలాగే తమిళ్ లోనూ కొంతమంది చైల్డ్ ఆర్టిస్ట్ లు ఇప్పుడు హీరో హీరోయిన్స్ మారిపోయారు. అలాంటి వారిలో అనిక సురేంద్రన్ ఒకరు. ఈ అమ్మడు చైల్డ్ ఆర్టిస్ట్ గా చాలా సినిమాల్లో నటించింది. అజిత్ సినిమాల్లో ఆయన కూతురిగా నటించి మెప్పించింది. ఇక ఈ బ్యూటీ తెలుగులో హీరోయిన్ గా ఓ సినిమా చేసింది. బుట్టబొమ్మ అనే టైటిల్ తో తెరకెక్కిన సినిమాలో అనిక సురేంద్రన్ హీరోయిన్ గా నటించింది. ఆ సినిమాలో తన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

అదేవిదంగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెచ్చిపోతుంది. వయసు చిన్నదే అయినప్పటికీ స్టార్ హీరోయిన్స్‌కు పోటీ ఇస్తూ అందాలతో కట్టిపడేస్తుంది. ఈ అమ్మడు ట్విట్టర్, ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫోటోలు కుర్రకారు మతిపోగొడుతున్నాయి. అందంలో హద్దులు చెరిపేస్తుంది ఈ చిన్నది.తాజాగా అనిక సురేంద్రన్ షేర్ చేసిన ఫోటోలు మతిపోగుడుతున్నాయి. క్రేజ్ ను పెంచుకునే పనిలో ఈ అమ్మడు సోషల్ మీడియాను గట్టిగావే వాడేస్తుంది. అలాగే ఈ బ్యూటీ తమిళ్ లో ఓ మై డార్లింగ్ అనే సినిమా చేసింది. ఈ మూవీలో లిప్ లాక్ తో రెచ్చిపోయింది. రాబోయే సినిమాల్లో ఈ ముద్దుగుమ్మ గ్లామర్ డోస్ పెంచి ఆకట్టుకునే అవకాశం ఉంది.



Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838